6న బండ్లగూడ కార్పొరేషన్ భవనం ప్రారంభం



మున్సిపల్ కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా నిర్మించిన కార్పొరేషన్ కార్యాలయ భవనాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రూ. 12 కోట్ల వ్యయంతో చేపట్టిన కార్యాలయ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయన్నారు. ఫిబ్రవరి 6వ తేదీన మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగానే భవనాన్ని సందర్శించామని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గోకరి సురేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



పూజలు నిర్వహిస్తున్న వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

మణికొండ: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్యవైశ్యులు వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరాలయంలో వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నార్సింగి రోడ్డులో ఉన్న లక్ష్మీమాత ఆలయంలో వాసవి క్లబ్ కపుల్స్ వారు కుంకుమార్చన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున మహిళలు, ఆయా అసోసియేషన్, క్లబ్‌ల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ మిర్జా రహమత్‌బేగ్

అత్తాపూర్: హసన్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత ఉర్దూ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను ఎమ్మెల్సీ మీర్జా రహమత్‌బేగ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ఉన్నత చదువులకు అవసరమైతే ఆర్థిక సాయం కూడా చేస్తామని తెలిపారు. నేతలు జాఫర్‌ఖాన్, మోసిన్ పాల్గొన్నారు.

వైభవంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం



విగ్రహాల ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని పురాతన నాగదేవత ఈదమ్మ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. గురువారం రాత్రి బుద్వేల్ నుంచి దేవాలయానికి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్థానిక భక్తులు అడుగడుగునా విగ్రహాలకు సాకలు పడుతూ స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు బీద స్వస్తి మహా గణపతి పూజ కార్యక్రమంతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు రేవల్లి రాజు శర్మ పంతులు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. బుద్వేల్ ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున కుండల్లో గంగా జలాన్ని తీసుకొచ్చి పూజల్లో పాల్గొన్నారు.

నేడు 'స్వయం వర్క్‌షాప్'

రాయదుర్గం: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ రూపొందించిన 'స్వయం వర్క్‌షాప్-2025' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూ నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, అండమాన్ అండ్ నికోబార్ ప్రాంతాలలోని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలో స్వయం కోర్సు అమలుపై అవగాహన కల్పిస్తారు. 'స్వయం' అనేది భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ప్రారంభించిన కార్యక్రమం. అత్యంత వెనుకబడిన వారితో సహా అందరికీ అత్యుత్తమ బోధనా అభ్యాస వనరులను తీసుకెళ్లడం లక్ష్యం.

అపార్‌పై ఎందుకంత నిర్లక్ష్యం?

నకిలీలకు కళ్లెం వేసేందుకు ఓ ఆయుధం

పెద్దగా పట్టించుకోని ప్రైవేటు విద్యా సంస్థలు

అవగాహన కార్యక్రమాలూ అంతంతమాత్రమే..

అత్తాపూర్: ఆటోమాటిక్ పర్మిట్ అకడమిక్ పర్మిట్ రిజిస్ట్రీ (అపార్) నకిలీ, దొంగ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట వేసేందుకు ఓ ఆయుధంలా పనిచేస్తుందనడం నిర్వివాదాంశం. అయితే అపార్ నమోదుపై ప్రైవేట్ విద్యా సంస్థలు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అపార్ నమోదు విషయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పెద్దగా స్పందించడం లేదనే చెప్పొచ్చు. ప్రధానంగా అత్తాపూర్ పరిధిలోని చాలా పాఠశాలల్లో అపార్‌పై చర్చకూడా జరగడం లేదనే ఆరోపణలూ ఉన్నాయి.

- ప్రాథమిక పాఠశాల అడ్మిషన్ దశలో విద్యార్థి వివరాలను అపార్ ద్వారా నమోదు చేయాలి. తద్వారా విద్యార్థికి ఒక వినూత్న సంఖ్య లభిస్తుంది. మొత్తం చదువు పూర్తయ్యే వరకు సదరు విద్యార్థికి అదే నెంబర్ కొనసాగుతుంది. ఇంకో విద్యార్థికి ఇదే నెంబర్ ఇచ్చే, వచ్చే అవకాశం ఎంత మాత్రం లేదు. అంత పటిష్టంగా అపార్ విధానం రూపుదిద్దుకుంది.
- దీంతో నకిలీ సర్టిఫికెట్ల జారీకి అపార్ నెంబర్ అడ్డుకట్ట వేస్తుంది. ప్రైవేట్ విద్యా సంస్థలకు ఇదే ఒక అడ్డంకిగా మారుతోంది. వారి అడ్డదారి సంపాదనకు అపార్ ఒక పెద్ద అవరోధం. అందుకే అడ్మిషన్ దశలో ఉద్దేశపూర్వకంగా అపార్ నమోదును ప్రైవేట్ సంస్థలు నిరాకరిస్తూ చేపట్టడం లేదని అర్థం చేసుకోవాలి.
- కనీస విద్యార్హతలు లేని కొందరు నకిలీ సర్టిఫికెట్లతో విద్యావంతులుగా చెలామణి కావడం ఇటీవల చాలా సందర్భాల్లో వెలుగుచూస్తున్నాయి.
- నకిలీ సర్టిఫికెట్ల దందాను అడ్డుకోవడమే అపార్ పథకం ప్రధాన లక్ష్యం. అర్హులకు మాత్రమే ఉదోగ అవకాశాలు లభించే ఈ విధానం అమలుపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించవలసిన అవసరం ఎంతో ఉన్నది. విద్యా సంస్థలలోని ఉన్నత యంత్రాంగం జిల్లా మండల స్థాయి యంత్రాంగానికి తగు అధికారాలు కల్పించగలిగితే నకిలీ సర్టిఫికెట్ల దందాను అడ్డుకోవడం సులువుగా మారిపోతుంది.



ఐడీ కచ్చితంగా ఉండాలి



ఆధార్ లాగా విద్యార్థికి అపార్ ఐడీ నెంబర్ కచ్చితంగా ఉండాలి. దీంతో విద్యార్థులకు ఉన్నత చదువు చదువుకునేందుకు వెళ్లే అవకాశం ఉంది. విద్యార్థి సర్టిఫికెట్లు అందుబాటులో లేకున్నా ఐడీ నెంబర్ సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోని అంతర్ జిల్లాలో కానీ ఇతర రాష్ట్రాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో నేరుగా వెళ్లి అడ్మిషన్ తీసుకునే అవకాశం ఉంటుంది. అడ్మిషన్ వివరాలు... ఆధార్ వివరాలు విద్యార్థుల తల్లిదండ్రులు అందించాలి.

– శంకర్‌రాథోడ్, రాజేంద్రనగర్ ఎంఈవో

అవగాహన కల్పించాలి



విద్యార్థులు లేకుండానే పాఠశాలలు, కళాశాలలు రికార్డుల్లో చూపించిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయం విద్యార్థులకు లాభంగా మారుతుంది. ఇందుకు తల్లిదండ్రులు సహకారం అవసరం. ప్రజల్లో అవగాహన కల్పించాలి. స్వచ్ఛంద సంస్థలు ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలి. ప్రైమరీ పాఠశాలల విద్యార్థులు మైనర్లుగా ఉంటారు. అడ్మిషన్ ప్రక్రియలు తల్లిదండ్రుల పాత్ర ప్రముఖ పాత్ర వహించాలి.

– ఎర్రవల్లి కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా టీచర్స్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు

అపోహలు వీడాలి



విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎలాంటి అపోహలు వద్దు. ఆధార్ కార్డు నెంబర్ లాగానే విద్యా వ్యవస్థలో అపార్ నెంబర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. కొంత మంది ఇస్తున్న తప్పుడు సమాచారం విద్యార్థులకు శాపంగా మారుతుంది. విద్యార్థులు చదువుకున్న చదువు సంబంధిత సర్టిఫికెట్లు కంప్యూటర్‌లో పొందుపరుస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరిద్దాం.

– సాయిప్రసాద్, ఉపాధ్యాయుడు

పాఠశాలల్లో ఆధార్ కేంద్రం ఉండాలి



రాజేంద్రనగ్ పట్టణ పరిధిలోని ఉన్న ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 0.5 నుంచి ఐదు శాతం కూడా అపార్ నమోదు కాలేదు. సర్టిఫికెట్ల కోసం ఆధార్ సెంటర్‌లకు వెళితే రెండు మూడు వేల రూపాయలు అడుగుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారుతున్న క్రమంలో అపార్ నమోదు ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు సంబంధిత పాఠశాలలో ఆధార్ సెంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

– బి.భాస్కర్, ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్

మణికొండలో సమస్యలు పరిష్కరించాలని వినతి



ప్రత్యేకాధికారికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: మణికొండ పురపాలక సంఘం పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించి ఉపశమనం కలిగించాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి జె.శ్రీనివాసరావును బీఆర్ఎస్ నాయకులు కోరారు. శుక్రవారం ఆయనను నగరంలోని సీడీఎంఏ కార్యాలయంలో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని ట్రాఫిక్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, గోతులమయమైన రోడ్లు, సరిపోని తాగునీరు, మురుగునీటి వ్యవస్థతో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారు. ఇప్పటి వరకు ఈ సమస్యలపై అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదని వారు పేర్కొన్నారు.

రిజర్వాయర్లను ప్రారంభించండి...

అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 4లోని స్పోర్ట్స్ పార్కులో నిర్మించిన 2.5 ఎంఎల్‌డీ రిజర్వాయర్‌ను ప్రారంభించి ప్రజలకు ఎదురవుతున్న నీటి సమస్యను పరిష్కరించటంలో జలమండలి అధికారులు విఫలం అవుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు ప్రజావసరాలకు తగ్గట్టుగా మరిన్ని రిజర్వాయర్లను మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నిర్మించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏజీ వర్సిటీకి పూర్తి స్థాయి అధికారుల నియామకం



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 14 సంవత్సరాల తరువాత పూర్తి స్థాయి అధికారులను నియమించారు. ఇప్పటివరకు పూర్తిస్థాయి అధికారులు లేనందున ఉన్న వారికే అదనపు బాధ్యతలు ఇచ్చారు. దాదాపు రెండేళ్లపాటు వీసీ కూడా ఇంచార్జిగానే ఉన్నారు. మూడు నెలల క్రితం పూర్తి స్థాయి వీసీని నియమించిన ప్రభుత్వం పూర్తి స్థాయి అధికారులను కూడా నియమించింది. విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ సంచాలకులు, డీన్‌లను నియమించింది. జనవరిలో ప్రారంభించిన ఈ కార్యక్రమం గురువారం పూర్తి చేశారు. ఇందులో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా సి.హెచ్.విద్యాసాగర్, పరిశోధన సంచాలకులుగా డాక్టర్ బలరాం, పీజీ స్టడీస్ డీన్‌గా కె.బి.ఈశ్వరి, విస్తరణ విభాగం సంచాలకులుగా డాక్టర్ ఎం.యాకాద్రి, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఆఫైర్స్‌గా డాక్టర్ చాల్లా వేణుగోపాల్‌రెడ్డి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్‌గా డాక్టర్ కె.ఝాన్సీరాణి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌గా డాక్టర్ కె.వి.రమణారావు, విశ్వవిద్యాలయం లైబ్రేరియన్‌గా వివేక్‌వర్ధన్‌ను నియమించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ... 14 సంవత్సరాల తర్వాత పూర్తి స్థాయి అధికారులను నియమించడం సంతోషకరమన్నారు. తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పూర్తి స్థాయి అధికారుల నియామకం కోసం ప్రాధాన్యమిచ్చి విశ్వవిద్యాలయం చట్టాలకు లోబడి ప్రతిభ, సమర్థత, సామాజిక సమీకరణాలను పాటిస్తూ నియమకాలను చేపట్టారన్నారు. వీటిలో భారతీయ స్టేట్ బ్యాంక్ సహాయంతో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కేంద్రం, బోధన, బోధనేతర సిబ్బంది నిరంతర శిక్షణ కోసం ఉద్దేశించిన మానవ వనరుల శిక్షణా కేంద్ర ప్రధానమైనవని వీసీ వివరించారు. నియమితులైన 18 మంది అధికారులలో ఐదుగురు మహిళా ప్రొఫెసర్లు ఉన్నారన్నారు. సమర్థత, ప్రతిభ, సామాజిక నాయ్యాన్ని పరిగణనలోకి తీసుకొని అధికారులను నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డిలకు వీసీ ధన్యవాదాలు తెలిపారు.

గుడిమల్కాపూర్ మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్

గోల్కొండ: గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ శుక్రవారం మార్కెట్ యార్డులోని కూరగాయల మార్కెట్, పూల మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన పి.ఇంద్రారెడ్డి పూలమార్కెట్‌ను సందర్శించారు. పూల మార్కెట్‌లో కేటాయించబడిన స్టాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పూల వ్యాపారులతో మాట్లాడి వ్యాపారం జరుగుతున్న తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఏపీ ప్రాంతం నుంచి రైతులు ప్రతిరోజూ తెస్తున్న వివిధ రకాల పూలు, వాటి లభ్యత, అమ్మకాల విషయంపై ఆయన పూలవ్యాపారులతో మాట్లాడారు. అనంతరం ఆయన కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. సీజనల్ కూరగాయలను రైతులు తెస్తున్న వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన వ్యాపారులకు మార్కెట్ యార్డులో ఎదురవుతున్న ఇబ్బందులు, వారికి కావాల్సిన అభివృద్ధి పనుల విషయమై చర్చించారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని ఓంనగర్ కాలనీలో ప్రమాదవశాత్తు ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో స్థానికులు, వాహనాదారులు ఈ ప్రాంతం గూండా ప్రయాణించేందుకు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ నేత గోకి సురేష్‌గౌడ్ వెంటనే స్పందించి విద్యుత్ అధికారులతో సంప్రదించి రోడ్డుపై పడిన స్తంభాన్ని తొలగింపజేశారు. కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు.


స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేయాలి



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: నిత్యం ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు చెత్తను అందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. 3వ డివిజన్‌లోని సాయిరామ్‌నగర్ కాలనీ, 4వ డివిజన్‌లోని భాగ్యనగర్ కాలనీ, 5వ డివిజన్‌లోని మాధవీనగర్ కాలనీలలో రోడ్ టూ డోర్ చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. తడి, పొడి, హానికారక చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోకు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు మల్లేష్, కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

'ఆప్టికా ఫెలో'గా ప్రొ.వేణుగోపాలరావు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సోమ వేణుగోపాలరావుకు అరుదైన అవకాశం లభించింది. అమెరికాలోని 'ఆప్టికల్ సొసైటీ ఆఫ్ అమెరికా'(ఆప్టికా) ఫెలో–2025 మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఆయన హెచ్‌సీయూలోని విశిష్ట భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ వేణుగోపాలరావు అల్ట్రాఫాస్ట్ స్పెక్ట్రోస్కోపి, నాన్ లీనియర్ ఆప్టిక్స్(ఎన్ఎల్ఓ) అధ్యయనాలు, పేలుడు పదార్థాలను గుర్తించే పద్ధతులకు మూడు దశాబ్దాలకు పైగా అకడమిక్, పరిశోధనా అనుభవంతో 15 రీసెర్చ్‌లను పర్యవేక్షించారు. పేలుడు పదార్థాలను గుర్తించే పద్ధతులపై ఆయన చేసిన పరిశోధనలకు గుర్తింపు లభించింది. ఆయనను హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, ప్రొఫెసర్లు అభినందించారు.

ఎక్సైజ్ అకాడమీలో మంత్రి జూపల్లి తనిఖీలు



ఎక్సైజ్ అకాడమీని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

బండ్లగూడ: బండ్లగూడలోని ఎక్సైజ్ అకాడమీలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయన వెంట ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ, అబ్కారీ శాఖ కమిషనర్ హరికిరణ్ ఉన్నారు. ఆయనకు స్వాగతం పలికి అకాడమీ డైరెక్టర్ అజయ్ రావు, ఇతర అధికారులు అకాడమీ పనితీరును వివరించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల పనితీరును తెలుసుకున్నారు. అనంతరం ప్రస్తుతం అకాడమీలో శిక్షణ పొందుతున్న 129 మంది మహిళా ట్రైనీ కానిస్టేబుళ్లతో మాట్లాడిన ఆయన శిక్షణ తరగతుల్లో చెప్పే పాఠాలు, ఫిజికల్ ట్రైనింగ్ను అడిగి తెలుసుకున్నారు. అకాడమీలో సదుపాయాలపై ఆరా తీశారు. ట్రైనీలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమని, గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, సారా అమ్మకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి, వాటి బారి నుంచి యువతను కాపాడేందుకు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన పేదలను ఆర్థిక పరంగా ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఎంతగానో ఆదుకుంటోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపల్ పరిధిలోని పుప్పాలగూడకు చెందిన రేణుక ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందింది. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయడంతో ఆమెకు రూ. 60 వేలు మంజూరైంది. అందుకు సంబంధించి చెక్కును లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి.శ్రీరాములు, శ్రవణ్‌కుమార్, పి.సత్యనారాయణ, ఎ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ: సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కాశీకానగర్ ప్రాంతానికి చెందిన యాదగిరి కొంత కాలంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక సమస్యల కారణంగా ఆయన సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మంజూరైన రూ. 60 వేలకు సంబంధించిన చెక్కును శుక్రవారం బాధితులకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అందజేశారు. మాజీ కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, మహేందర్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న యూత్ క్లబ్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం నవ యువ యూత్ క్లబ్ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను క్లబ్ ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. తాగు నీటి సౌకర్యం సరిగా లేదని.. బోర్ వెల్ నీరు సరిపోవడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి కలిసి హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులను కలిసి మరొక నూతన వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ త్వరలోనే కొత్త కనెక్షన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. పాఠశాల హెచ్ఎం ఎం.సుజాత, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, జ్యోతి, పద్మ, మహేశ్వరి, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు ఖాదర్, జలావుద్దీన్, ప్రసాద్, రఘునాయక్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌వి చిల్లర ఆరోపణలు: కాంగ్రెస్

మణికొండ: ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు ఎం. జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, యూత్ అధ్యక్షుడు కస్తూరి సతీష్ ఆరోపించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ... అసలైన 420లు బీఆర్ఎస్ పార్టీ నాయకులేనని ఘాటుగా విమర్శించారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేయటంతోనే పథకాల అమలు కాస్త ఆలస్యం అవుతున్నా అన్నీ అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదే అని వారు స్పష్టం చేశారు. ఇప్పటికే ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే వంట గ్యాస్, కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీని రూ. 10 లక్షలకు పెంచటం, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాలను అమలు చేశారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు లేరనే విషయాన్ని వారు తెలుసుకోవాలన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ముందు నుంచి బీఆర్ఎస్ పార్టీని ప్రజలు వ్యతిరేకించారనే విషయాన్ని గమనించాలన్నారు. మున్సిపాలిటీకి రావాల్సిన కోట్లాది నిధులను మళ్లించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. ఇకైనా బీఆర్ఎస్ పార్టీ నాయకులు వారి పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

బాడీ బిల్డర్ భిక్షపతికి ఎమ్మెల్యే అభినందన



భిక్షపతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: బాడీ బిల్డింగ్ మాస్టర్ ఓపెన్ కేటగిరీలో నాలుగో స్థానం సాధించిన మండలంలోని కాచారంవాసి మైలారం భిక్షపతిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శుక్రవారం అభినందించారు. తెలంగాణ అమెచ్యూర్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎస్ ఫిట్‌నెస్ స్టుడియో, అభి ఫిట్‌నెస్ స్టుడియో నిర్వహణలో ఏర్పాటు చేసిన ఏజీ క్లాసిక్ బిగ్గెస్ట్ ఫిట్‌నెస్ ఎక్స్‌పో-2025 పోటీల్లో భిక్షపతి నాలుగో స్థానంలో నిలిచారు. లక్ష్య సాధనకు వయస్సుతో సంబంధం లేకుండా బాడీ బిల్డింగ్ పోటీలో రాణించిన భిక్షపతి కృషిని ఎమ్మెల్యే అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల జహంగీరాబాద్ ఫీడర్ పరిధిలోని క్రిస్టల్ టౌన్, జహింగీరాబాద్, మిలాత్ నగర్, వాదే ఈ ఫహార్న్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.
- ఉదయం11.30 నుంచి 12 గంటల వరకు మైలార్‌దేవ్‌పల్లి ఫీడర్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి గ్రామం, ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీ, టాటానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు.
- మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు కాటేదాన్ సబ్‌స్టేషన్ లక్ష్మీగూడ ఫీడర్ పరిధిలోని లక్ష్మీగూడ గ్రామం, హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్‌జీకే, బాంబే కాలనీ, బృందావన్ కాలనీ, గణేష్‌నగర్ (హౌసింగ్ బోర్డు) తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వారు వివరించారు.

కిస్మత్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో...

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ ఎ.మల్లేష్‌రాజ్ తెలిపారు. బండ్లగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 వరకు ఆరె మైసమ్మ మెయిన్ రోడ్డు, కాశీకానగర్, ఎస్ఎఫ్‌పీ కాలనీ, మల్లికార్జుననగర్, ఆదర్శనగర్ రోడ్ 1,5, న్యూ కేర్ ఆస్పత్రి, గాయత్రీ నగర్, వికాస్‌నగర్, ద్వారకానగర్, యాదవమిత్ర కాలనీ, షిరిడీ సాయిబాబా కాలనీ, ప్రశాంత్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్, భారతీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

- విద్యాపీఠం ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరస్వతీ పీఠం, భవానీ కాలనీ, సిరి ఎన్‌క్లేవ్, శ్రీనివాసం ఎన్‌క్లేవ్, దాత్రి లేఅవుట్, ఆనంద్‌నగర్, కృష్ణానగర్, శివాజీయూత్ బిల్డింగ్, బండ్లగూడ జాగీరు పోచమ్మ దేవాలయం, వికాస్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఆపివేస్తామని తెలిపారు.
- కిస్మత్‌పూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కిస్మత్‌పూర్ గ్రామం, రాఘవేంద్ర కాలనీ, శివసాయి కాలనీ, బాబమ్మ కాలనీ, మైత్రీ కాలనీ, వినాయకనగర్, మారుతీ కాలనీ, ఎస్సీ బస్తీ, శ్రీకృష్ణా కాలనీ, విల్లా గ్రీన్, ఆద్యా విల్లాస్, ఓఎస్ఎక్స్ విల్లాస్, గృహషిప్, గిరిధార్ అపార్ట్‌మెంట్, హనుమాన్ దేవాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వివరించారు.